ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023 5
అనంతపురం

అన్నదాత ఆఖరి ప్రయాణం..!

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన అన్నదాతలలకు అదే ఆఖరిప్రయాణం అయ్యింది. వర్షం చినుకు నింగిని తొంగిచూడకున్నా, ఉన్న కొద్దిపాటి నీటి వనరులతో వరిపంటను సాగు చేశారు. పంటను కోత కోసి వడ్లను బియ్యంగా మార్చుకున్నారు. సంతోషంగా బియ్యాన్ని ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో అనుకోని ప్రమాదం వారి ఆయువును తీసింది. ఏకంగా నలుగురు రైతులు ఘటనా స్థలంలోనే మరణించారు. గార్లదిన్నె మండలం కల్లూరు పెన్నానది వంతెన 44వ జాతీయ రహదారిపై శనివారం వేకువజామున చోటు చేసుకున్న ఈ ఘటన పెను విషాధాన్ని మిగిల్చింది. మృతులంతా ఒకే గ్రామం, ఒకే కుటుంబానికి చెందిన దాయాది వరుస అన్నదమ్ములు కావడంతో వారి బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామం కన్నీటి సంద్రం అయ్యింది. అంతర్జాతీయ రైతు దినోత్సవం రోజున నలుగురు రైతులు అనుకోని ప్రమాదంలో మృత్యుఒడికి చేరడం అన్నదాతలకు తీవ్ర దు:ఖాన్ని మిగిల్చింది.

- వేకువజామున కబళించిన మృత్యువు
- కల్లూరు నేషనల్‌హైవేపై ఘోర ప్రమాదం
- అక్కడికక్కడే నలుగురు రైతులు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- మృతులంతా ఒకే గ్రామం.. ఒకే కుటుంబానికి చెందిన బంధువులు
- రైతుదినోత్సవం నాడు పెనువిషాదం

ప్రజాశక్తి-గార్లదిన్నె, గుత్తి

గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కుమ్మరి చిన్నతిప్పన్న(48), కుమ్మరి శ్రీనివాసులు(47), కుమ్మరి నాగార్జున (32), కుమ్మరి శ్రీనివాసులు(30)లు దాయాది వరుస అయ్యే అన్నదమ్ములు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటీవల సాగు చేసిన వరిపంటను కోత కోసి వడ్లను బియ్యంగా మార్చుకునేందుకు శుక్రవారం రాత్రి గార్లదిన్నె మండలం కల్లూరు వెంకటరాముడికి చెందిన రైస్ మిల్లుకు తీసుకొచ్చారు. అక్కడ వడ్లను బియ్యంగా మార్చుకుని ట్రాక్టర్లో వాటిని తీసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. శనివారం వేకువజామున 3గంటల సమయంలో కల్లూరు పెన్నానది వంతెన 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి అతివేగంగా ఢీకొంది. దీంతో ట్రాక్టర్లో ఉన్న నలుగురు రైతులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. వేగంగా వచ్చిన బస్సుచక్రలు వారి మీదుగా వెళ్లాయి. దీంతో ఘటనా స్థలంలోనే రైతులు కుమ్మరి చిన్నతిప్పన్న, కుమ్మరి

ఘటనా స్థలంలో రైతుల మృతదేహాలు...

శ్రీనివాసులు, కుమ్మరి నాగార్జున, కుమ్మరి శ్రీనివాసులు అక్కడికక్కడే మరణించారు. కుమ్మరి హరి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతం భీతావాహకంగా మారిపోయింది. ఈ ట్రాక్టర్

మాముడూరులో విషాధం

మృతి చెందిన రైతులందరూ గుత్తి మండలం మామడూరు గ్రామానికి చెందిన వారు కావడంతో అక్కడ విషాదఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను శనివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఒక్కసారిగా నలుగురి మృతదేహాలు రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

మృతులంతా బంధువులే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా ఒకరికి ఒకరు సమీప బంధువులు అవుతారు. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వీరంతా మామడూరు గ్రామంలో ఒకే ప్రాంతంలో నివశించేవారు. చిన్నతిప్పయ్య, నాగార్జునలు వరుసకు తండ్రి కుమారులు అవుతారు. శ్రీరాములు వారికి సమీప బంధువు. శ్రీనివాసులుకు మిగతా ముగ్గురు మామలు అవుతారు.



ప్రమాదానికి కారణమైన బస్సు...

ముందు వెళ్తున్న మరో ట్రాక్టర్లోని రైతులు ప్రమాదాన్ని గుర్తించి ప్రయివేటు బస్సును అక్కడే ఆపేశారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రయివేటు బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, అతివేగంగా బస్సును నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాధితుల ఆందోళన

అతివేగంతో ప్రమాదానికి కారణం అయిన ప్రయివేటు బస్సు యజమాన్యం మృతి చెందిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బంధువులు ఘటనా స్థలంలో ఆందోళనకు దిగారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు మృతదేహాలను తీసుకెళ్లమంటూ అక్కడే బైటాయించారు. పోలీసులు వారికి సర్దిచెప్పి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి వారితో ఆందోళన విరమించారు. ఒకే గ్రామం, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రైతులు మృతి చెందడంతో మామడూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అన్నదాత ఇంట మృత్యుచీకటి

ప్రమాదంలో మృతి చెందిన నలుగురూ సాధారణ మధ్య తరగతి రైతులే కావడం విచారకరం. ఈ ఘటనతో ఆ రైతుల ఇంటి చీకట్లను మిగిల్చింది. వ్యవసాయం తప్పా వేరేజీవనాధారం లేదు. అలాంటి వారు అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాలు కకావికలం అయ్యాయి.

- **రైతు పసులూరు శ్రీరాములు** వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సునీతకు వివాహమయ్యింది. చిన్న కుమార్తె ఇందు బిటెక్ చదువుతోంది. వ్యవసాయం చేస్తూనే పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని భావించాడు. అనుకోని ప్రమాదంలో ఇంటి పెద్ద మరణించడంతో ఆ కుటుంబంలో విషాధం మిగిల్చింది.



- **రైతు కండ్లపల్లి చిన్న తిప్పయ్యకు** వ్యవసాయమే జీవనాధారం. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వ్యవసాయం, చిన్న కుమారుడు పురుషోత్తం డిగ్రీ చదువుతున్నాడు. కుమారులతో కలిసి వ్యవసాయం చేసుకుని ఈయన కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమారులను మంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే తపనవాడేవారు. ప్రమాదంలో ఆయన మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

- **రైతు కండ్లపల్లి నాగార్జునకు** వ్యవసాయం అంటే చాలా ఇష్టం. పంట సాగు చేస్తూనే కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన భార్య జయలక్ష్మి, కుమారుడు అభినవ్, కుమార్తె మన్విత ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో వరి పంటను సాగు చేసేవాడు. వచ్చిన వరి ధాన్యాన్ని విక్రయించి దాని ద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించేవాడు. అలా బియ్యాన్ని తీసుకొచ్చేందుకు వెళ్లిన వ్యక్తి అనుకోని ప్రమాదంలో మరణించడం ఆ కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టేసింది.

- **రైతు మామిళ్లపల్లి శ్రీనివాసులు** మరణించడం అత్యంత విషాధకరం. ఈయన భార్య మౌనిక బాలింత. నాలుగు నెలల క్రితమే ఈమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. శ్రీనివాసులు వ్యవసాయంతో పాటు ఆటో నడుపుతూ కుటుంబాన్ని జీవనం పోషించుకునేవాడు. ఎకరం మెట్ట భూమి, అర ఎకరం మాగానిలో పంటలు సాగు చేవాడు. ప్రమాదంలో ఈయన మరణించడంతో నాలుగు నెలల చిన్నారితో భార్య రోధిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడిపెట్టించింది.

పోరాటమే నినాదం..!

ఉరవకొండలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

- 12వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె
- అన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు

అంగన్‌వాడీ 12వ రోజు సమ్మె

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె పోరాటమే నినాదంగా కొనసాగుతోంది. ప్రభుత్వం స్పందించేంత వరకు పోరు ఆగదంటూ అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. శనివారం నాటికి సమ్మె 12వ రోజుకు చేరుకుంది. కార్యకర్తలు, హెల్పర్లు మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేస్తున్నారు. మానవహారాలు, భిక్షాటన, ఒంటికాలిపై నిరసన తదితర రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వైసిపి పాలకులు మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం అని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, టిడిపి నాయకుడు మురళి, వెంకట క్రిష్ణ, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీతస్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏపిటిఎఫ్ (1928) రాష్ట్ర కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా హాజరై మద్దతు తెలిపారు.

వార్త 6లో

గడ్డితిని బతకాలా..?

- కనీస వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గం
- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఎ ఉద్యోగుల వినూత్న నిరసన
- 4వ రోజు కొనసాగిన సమ్మె

కలెక్టరేట వద్ద గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమగ్రశిక్షా 4వ రోజు సమ్మె

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'నెలవారి వేతనాలపైనే ఉద్యోగులు ఆధారపడి జీవిస్తున్నారు. పేరుకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పనిమాత్రం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా చేయిస్తున్నారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోతే గడ్డి తిని బతకాలా'.. అంటూ సిపిఎం, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు, బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 4వవ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ ఛైర్మన్ విజయ్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు బైటాయించి ప్లేట్‌లలో వరిగడ్డి పెట్టుకుని ప్రభుత్వం స్పందించకపోతే గడ్డి తిని బతకాలంటూ నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఉద్యోగుల వినూత్న నిరసనకు ప్రజలు కూడా మద్దతు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, ఏపీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయభాస్కర్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్, కార్యదర్శి రామాంజినేయులు, ఎస్ఎస్ఎ ఈఈ, డిఈలు, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఏటిఎం.నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, రామాంజినేయులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్ర కమిటీ నేతలతో ప్రభుత్వం చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్-ఎస్ఎ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభాకర్, విష్ణు, సునీత, మాధవ్, నాగభూషణ్, నాగజ్యోతి, కళ్యాణి పాల్గొన్నారు.

నుజ్జునుజ్జయిన ఐచర్ వాహనం, లారీ

పామిడి వద్ద మరో ప్రమాదం ఒకరు మృతి

పామిడి: అనంతపురం జిల్లా పామిడి పెన్నానది బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన మరో ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మదనపల్లి నుంచి టమోటా లోడ్‌తో కర్నూలు వైపునకు వెళ్తున్న ఐచర్ వాహనం పామిడి పెన్నానది బ్రిడ్జ్ మీద ఆగిఉన్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి మండలం, మొలకలచెరువు గ్రామానికి చెందిన ఐచర్ డ్రైవర్ వడ్డే వెంకటనారాయణ(40) అక్కడికక్కడే మరణించాడు. క్లీనర్ బాబాజీ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

మిరప రైతులను ఆదుకోవాలి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాల్ : రాష్ట్ర ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. శనివారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో హెచ్ఎల్‌సి కింద సాగు చేసి ఎండిపోయిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులకు తోడు హెచ్ఎల్‌సి కాలువకు నీరు బంద్ చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అయినా అటు ప్రభుత్వానికిగానీ, నాయకులకుగానీ పట్టకపోవడం బాధాకరమన్నారు. స్థానికంగా ఓ మంత్రి ఉన్నా ఏమీ మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో ఉందన్నారు. తుంగభద్ర జలాశయంలో డైవర్స్ వాటర్ రెండు టీఎంసీలు ఆంధ్ర వాటా ఉన్నా ఆ నీటిని తీసుకురావడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. సాగునీరు కావాలని మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా నీళ్ల తేలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రైతులు తీవ్ర నష్టాలపాయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బలరామ్‌రెడ్డి, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ సర్పంచులు కేశప్ప, గోవిందవాడ దేవేంద్రప్ప, బొల్లనగుడ్డం గోపాల్, సింగేపల్లి గోపాల్, బొమ్మనహాల్ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలిస్తున్న నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని సచివాలయ-2లో అధికారి భానుప్రకాష్‌కు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాము మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారన్నారు. కావున రైతుల అప్పులు మాఫీ చేయాలని, పంట నష్ట పరిహారం కౌలు రైతులకు కూడా అందించాలని, వలసల నివారణకు ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. మరోవైప హెచ్ఎల్‌సి హంద్రీనీవా కాలువ కింద వేసిన మిరప, మొక్కజొన్న, తదితర పంటలు చేతికి వచ్చే సమయంలో నీటిని బంద్ చేయడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. పంటలు పూర్తయ్యే వరకూ నీరు ఇవ్వాలనే రైతుల డిమాండ్ చేసినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఉదారంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినా సహాయ చర్యలను చేపట్టడం లేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, మిరప పంటకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివశంకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారి భానుప్రకాష్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

నిరవధిక సమ్మె విజయవంతానికి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారానికి ఈనెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు ప్రజలు మద్దతు కోరుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, తిలక్ రోడ్డు, గాంధీ బజార్, బసవన్నకట్ట, అంబేద్కర్ నగర్, కలెక్టరేట్ మీదుగా సాగింది. ఈ ర్యాలీని సిఐటియు నగర కార్యదర్శి వెంకట్‌నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ముర్తుజ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, బకాయి డీఏలు ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు సాకే తిరుమలేశు, బండారి స్వామి, సిఐటియు నగర కోశాధికారి ప్రకాష్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంజీవరాయుడు, మల్లికార్జున, ఇంజనీరింగ్ విభాగం నగర కార్యదర్శులు కోశాధికారి ఓబుళపతి, పోతులయ్య, మహిళా నాయకురాళ్లు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, కాంతమ్మ, లక్ష్మీదేవి, కుమారి, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం.నల్లప్ప, రెగ్యులర్ నాయకులు ఎల్.ముత్తు, ఆదినారాయణ, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, రాజు, వెంకటేష్, ప్రభాకర్, లక్ష్మయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

లింగ నిర్ధారణ నేరం : ఆర్‌డిఒ

అనంతపురం : గర్భస్థ లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని ఆర్‌డిఒ గ్రంధి వెంకటేష్ అన్నారు. పిసి పిఎన్‌టిడి యాక్ట్ అమలుపై శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజినల్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించి ఎక్కువ ఫలితాలను సాధించేందుకు సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బాధ్యులైన అధికారుల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించారు. అనంతరం పిసి పిఎన్‌డిటి యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ గ్రామాలు, మండలాల్లో పిసి పిఎన్‌డిటి యాక్ట్ అమలు చేస్తున్న తీరును వివరించారు. అలాగే మూతబడిన స్కానింగ్ సెంటర్, స్వాధీనం చేసుకున్న యంత్రాలను తెలిపారు. అంతేగాకుండా లింగ నిర్ధారణపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఐసిడిఎస్, మెప్మా, డ్వామా, మహిళా పోలీస్ ద్వారా ప్రతి శుక్రవారం, ప్రతినెలా 9, 10వ తేదీన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కమ్యూనిటీ డైరెక్టర్ సిద్రప్ప, రెడ్స్ సంస్థ బానూజా, గైనకాలజిస్టు డాక్టర్ నిస్సార్ బేగం, చిన్నపిల్ల డాక్టర్ రవి, గురుప్రసాద్, హెడ్స్ సంస్థ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటమే నినాదం

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె.. వినూత్న రీతిలో నిరసనలు.. పలుపార్టీలు, సంఘాల మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు రోడ్లపై వచ్చి ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవదిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెకు రాంభూపాల్‌తోపాటు, టిడిపి నాయకుడు మురళి, వెంకట క్రిష్ణ, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీతస్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎపిటిఎఫ్ (1928) రాష్ట్ర కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సిఎం జగన్ 'మాట ఇస్తే తప్పను మడమ తిప్పను' అనే చెబుతూ ఉంటాడని, మాట తప్పను అంటే అంగన్‌వాడీల పట్ల చేస్తున్నది ఏదో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లుకావస్తున్నా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. 12 రోజులు అంగన్‌వాడీ కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే కనీసం చర్చలు జరిపే తీరిక కూడా లేకుండా వ్యవహరించడం శోచనీయంగా ఉందన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వం భవితవ్యం ప్రజల చేతుల్లో ఉందన్నారు. మీ స్పందన బట్టి అధికారంలో కూర్చొబెట్టాలా ప్రతిపక్షంలో కూర్చోబెట్టాలో నిర్ణయిస్తారన్నారు. అధికారం ఉందని పట్టనట్లు వ్యవహరిస్తే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయ భారతి, జమున, అరుణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను విచ్చిన్నం చేయడం ఎవరితరం కాదని, చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తెలంగాణ కంటే మెరుగైన వేతనం ఇవ్వాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 12వరోజు శనివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా ఉరవకొండలో చేపట్టిన సమ్మెకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ మొండి వైఖరిని విడానాడి చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సేవ చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కొంతమంది నయవంచకులు ప్రభుత్వానికి వత్తాసు పలకడం బాధాకరమన్నారు. మహిళా వ్యతిరేకిగా ఉన్న రాంగోపాల్ వర్మ అంగన్వాడీలను కించపరిచే విధంగా మాట్లాడడం తీవ్ర అభ్యంతరకమన్నారు. అలాగే ఆహార కమిటీ ఛైర్మన్ విజయప్రతాపరెడ్డి చాలా వ్యంగ్యంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. చట్టం ప్రకారం కనీస వేతనం అడుగుతుంటే అవహేలన చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు జ్ఞానమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్, సెక్టార్ లీడర్ రంగమ్మ, వరలక్ష్మి, శ్వేత, సరోజమ్మ, ధనలక్ష్మి, విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల, నాగవేణి, లోకమ్మ, శివశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని అంగన్వాడీలు 12వరోజు బళ్లారి-కణేకల్ ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు పార్వతి, ఉపాధ్యక్షురాలు లావణ్య మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోరికలు అడగడం లేదని, స్వయానా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఎర్రజెండాలు చేతబట్టుకుని గీతాలు ఆలపించారు. తర్వాత మోకాళ్లపై నిల్చొని వేపాకు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు.

నార్పల : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 12వ రోజు శనివారం కళ్ళకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నార్పల ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, సెక్టార్ లీడర్లు పి.రామంజినమ్మ, కళావతి, రేణుక, సుధా, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలో బోనాలతో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా తేరు బండి వరకూ బోనాల ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్వాడీలు దాదాపు 12 రోజులుగా సమ్మె చేస్తుంటే స్పందించకపోవడం బాధాకమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వీరితోపాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఆందోళనలో ఉన్నారన్నారు. వారి సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంత్యాయని, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, నాయకులు సంజీవరెడ్డి, పుల్లయ్య, నెట్టికల్లు, అంగనవాడీలు, తదితురులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 12వరోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సేవలు చేసే అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, సెక్టార్ లీడర్లు రాధిక, రుద్రమ్మ, మల్లమ్మ, చంద్రకళ, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వేపాకు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

అనంతపురంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ఆత్మకూరు : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పుట్లూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 12వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, మహిళలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజారామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సూరి, రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యురాలు శిరీషా, మండల కమిటీ మండల నాయకులు జి.వెంకటచౌదరి, పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకురాళల జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, అంగన్వాడీలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చెవులు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు ఎం.మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి అంగన్వాడీ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు. మల్లికార్జున, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, నాగరత్న, కళ్యాణి, లలితమ్మ, బావమ్మ, తదితరులు పాల్గొన్నారు

పామిడి : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు జయంతి, నారాయణమ్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అద్దెలు చెల్లించాలని, టిఎ బిల్లులు ఇవ్వాలనే తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, షేకున్‌బి, ప్రేమకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గార్లదిన్నె : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చెవిలో పూలు పెట్టుకుని మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీలు అరుణ, దేవి, లలిత, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో బోనాలు ఎత్తుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

గుమ్మఘట్టలో ఉరేసుకుంటూ నిరసన

గార్లదిన్నెలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

పామిడిలో అంగన్వాడీల ఆందోళన

మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

పామిడి : గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద జాతీయ రహదారిపై మృతిచెందిన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శనివారం ఆర్థికసాయం చేశారు. కల్లూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున వెనుక నుంచి వేగంగా వచ్చిన వోల్వో బస్సు, ముందు వెళ్తున్న బియ్యం ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన రైతులు కుమ్మర శ్రీరాములు, కుమ్మర శ్రీనివాసులు, కుమ్మర నాగర్జున, కుమ్మర చిన్న తిమ్మప్ప మృత్యువాత పడ్డారు. మృతదేహాలను పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవిఆర్ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు అనంతరం ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ప్రభుత్వ నుంచి రావాల్సిన పరిహారాన్ని త్వరగా అందజేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తుగ్గిలి నాగేంద్ర, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, గుత్తి మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పామిడి పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు నేషనల్ ఆర్బిటర్స్‌గా ఉత్తీర్ణత

కాశి రవీంద్ర బాబు బోయ గోవిందరాజులు గంతి మెహరాజ్

అనంతపురం : ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగం సమాఖ్య సంయుక్తంగా నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటర్ సెమినార్ పరీక్ష ఫలితాల్లో జిల్లా నుంచి ముగ్గురు ఆర్బిటర్స్‌గా ఉత్తీర్ణత సాధించినట్లు ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌నాయుడు, కోశాధికారి ఇంటూరి కిశోర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ రవీంద్రబాబు (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), బోయ గోవిందరాజులు (చెస్ కోచ్), గంతి మెహరాజ్ (చెస్ కోచ్) ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరు జిల్లాలో జరిగే చదరంగం పోటీలకు ఆర్బిటర్స్‌గా వ్యవహరిస్తూ క్రీడాభివృద్ధికి దోహదపడతారన్నారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఛాంబర్ ప్రారంభం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌ను గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.5.25 లక్షలతో ఛాంబర్ మరమ్మత్తులు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఎల్ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే..

బుక్కరాయసముద్రం : కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, ఇందుకు ఎస్ఐగా ఎంపికైన చెన్నంపల్లికి చెందిన రాజకుళ్లాయప్ప నిదర్శనమని ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు సాకే హరి అన్నారు. మొదటిగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చేరుకుని రాజకుళ్లాయప్పను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన రాజకుళ్లాయప్ప ఎస్ఐగా ఎంపిక కావడం శుభపరిణామం అన్నారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ కొడుకును చదివించడంతో వారి కళలను నెరవేర్చిన రాజకుళ్లాయప్పను అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు, శేషు, మధు, రాజు, జెఎసి నాయకులు చిన్నికృష్ణ, వెంకటాపురం నారాయణస్వామి, కుళ్లాయప్ప, భాస్కర్, మంజు, శివ, హరి, ఓబులేసు, వెంకటేశు , చెన్నంపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

నార్పల : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌కు ప్రహరీ నిర్మించి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ధ్వంసమైన హాస్టల్ ప్రహరీని నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి హాస్టల్‌లో పడిపోయిన ప్రహరీని నిర్మించి విష కీటకాలను నుంచి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఇన్‌ఛార్జి రంగాపురం పుల్లప్ప, ఎపి ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు మీనుగ రామాంజనేయులు, గొల్లపల్లిదొడ్డి వీరప్ప, జిల్లా కార్యదర్శి తుంపెర రామకృష్ణ, మేకల రాజు, కేశపల్లి వెంకట్‌నారాయణ, తదితరుల పాల్గొన్నారు.

తహశీల్దార్ అక్రమాలపై విచారించాలని వినతి

బెలుగుప్ప : మండలంలో తహశీల్దార్ ఓబులేసు చేసిన అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎంపిపిల సంఘం అధ్యక్షులు పెద్దన్న ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ రాణి సుస్మితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణ, సమాచారంలో భూమిని ఎక్కించాలంటే రైతులు డబ్బులు ముట్టజెప్పకుంటే చేయడం లేదన్నారు. మండలంలో ఓ ప్రయివేటు టీంను ఏర్పాటు చేసుకుని దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎపిటిఎఫ్ ఆత్మకూరు మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు

అనంతపురం కలెక్టరేట్ : ఆత్మకూరు మండలం ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ తెలిపారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ ఆత్మకూరు మండల కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సిరాజుద్దీన్ ఎన్నికల పరిశీలకుగా వ్యవహరించారు. మండల గౌరవాధ్యక్షులుగా ఏ.నరహరి, అధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కె.మదనమోహన్, జిల్లా కౌన్సిలర్‌లుగా జి.గురురాజ్, ఎం.లక్ష్మీనారాయణ, ఎం.పద్మావతి, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాస్‌బాబు, సి.మోరిరెడ్డి, జి.ప్రమీల, ఎం.వెంకటేష్‌నాయక్, కె.భాస్కర్, కార్యదర్శులుగా కె.రామలింగయ్య, పి.ప్రభాకర్, వి.నారాయణస్వామి, కె.నాగజ్యోతి, డి.శిరీషా, ఇసి సభ్యులు, తదితరులను ఎన్నుకున్నారు.

జెఎన్‌టియులో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసిఎ కోర్సుకు, మేనేజ్‌మెంట్ విభాగంలో ఎంబిఎ కోర్సులు, ఒటిపిఆర్ఐ కళాశాలలో ఎంఎస్‌సి కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ అడ్మిషన్ ఆర్.కిరణ్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన కన్వీనర్ సీట్లలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సులకు ఈనెల 26, 27, ఎంఎస్‌సి సీట్లకు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంతవరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోకుండా ఉండే విద్యార్థులు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులు అన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజ్ రీజురీయింబర్స్‌మెంట్‌కు అనర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, జిరాక్స్ కాపీలను తీసుకుని ఉదయం 10 గంటలకు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు రావాలని కోరారు.

29న 'అనంత'లో సామాజిక సాధికార యాత్ర

అనంతపురం : ఈనెల 29న అనంతపురంలో వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని యాపిల్ గార్డెన్స్‌లో 'సామాజిక సాధికార బస్సు యాత్ర'పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29న సాయంత్రం 3.00 గంటలకు జెడ్పీ కార్యాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాతూరు వరకూ ర్యాలీ ఉంటుందన్నారు. 3.30 గంటలకు గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఏ సిఎం చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా, సామాజికంగా అండగా నిలుస్తున్నారని వివరించారు. జగన్ సీఎం అయ్యాక అవినీతికి ఆస్కారం లేకుండా డీబీటీ, నాన్ డీబీటీ కింద ఏకంగా 4.69 లక్షల కోట్ల లబ్ధిని చేకూర్చామని గుర్తు చేశారు.

జాతీయ రైతు దినోత్సవం

అనంతపురం : అనంతపురం వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఎడిఎ ఎం.రవి అధ్యక్షతన శనివారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతులకు చేరవేసేందుకు వ్యవసాయ శాఖ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సోమశేఖర్, శేఖర్‌రెడ్డి, సుచరిత, సాంకేతిక వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

విద్యార్థులకు మొమెంటోలు అందజేస్తున్న అతిథులు

అనంతపురం : స్థానిక రుద్రంపేట వద్దగల పి.వి.కె.కె.ఐ.టి. పాలీటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రెండవ సంవత్సరం విద్యార్థులు ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కె.అశ్రిఫ్‌అలీ, కళాశాల ఛైర్మన్ పల్లె వెంకట క్రిష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ 2013లో ప్రారంభించిన కళాశాల అతికొద్దికాలంలోనే అడ్మిషన్లలో, పరీక్ష ఫలితాలల్లో ఆంధ్రప్రదేశ్‌లోనే నెంబర్-1గా నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, అకాడమీ డీన్ వి.సంతోష్‌కుమార్‌రెడ్డి, బి.టెక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర ప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జివిఎస్.వైభవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోరాట కాలం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆయా పార్టీ నేతలు టిక్కెట్లు, గెలుపోటములపై దృష్టి సారించారు. ఇదే సమయంలో కార్మికులు, ఉద్యోగులు, తమ సమస్యల పరిష్కారానికి పోరాటమార్గాన్ని ఎంచుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాలుగేళ్ల అడుగుతూ వచ్చిన ఉద్యోగులు, కార్మికులు ఇక పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. ఇచ్చిన మాట నిలుపుకోవాలని చేస్తున్న పోరాటాలు ఉవ్వెత్తున ఎగిశాయి. ఎన్నికల సమయంలోనైనా అంతక ముందు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని అడుగుతున్నారు. ఒకవైపు అధికార వైసిపి ఏమో 99 శాతం మేనిఫెస్టోను అమలు చేశామని ప్రచారం చేస్తోంది. అయితే ఈ హామీల పరిస్థితి ఏంటని ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కానీ ప్రభుత్వం దీన్ని ఏ మాత్రం పట్టించుకునే పరిస్థితులు కనిపించకపోవడంతో పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీల చేపట్టిన సమ్మె ఉధృతమైంది. మహిళలు పెద్దఎత్తున పోరాటాన్ని చేపట్టడంతో ప్రభుత్వం ఏం చేయాలో పాలుపోక సమ్మెను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగుల చేత అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభిస్తోంది. అయితే కేంద్రాలు తెరచినప్పటికీ పిల్లలకు అందాల్సిన సేవలు అందించడం లేదుగానీ, వారే ఆడుకోవడం వంటివి కనిపించాయి. అయితే ప్రభుత్వం ఏదో సమస్యకు పరిష్కారం చూపినట్టు కలరింగు ఇచ్చే ప్రయత్నామూ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు బకాయి ఉన్న అద్దెలు, ఇతర వాటిని పరిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. కనీస వేతనం, ఉద్యోగ బద్రత అంశాలేవి ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇదే సమయంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన బాటపట్టి ఉన్నారు. మరోవైపు ఎస్ఎస్ఎ ఉద్యోగులు నాలుగు రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వచ్చే వారంలో మున్సిపల్ వర్కర్లు సమ్మెకు దిగబోతున్నారు. ఈమేరకు ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు సమ్మె నోటీసులు అందజేశారు. వీరందరూ అడుగుతున్నది ఒక్కటే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. కొన్ని నెలల్లో ఎన్నికలొస్తున్నందున ఇప్పటికైనా ఈ హామీలు అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం వీటిని ఏ మాత్రం పట్టించుకునేందుకు ముందుకు రాకపోగా, ఆందోళనలను అణచిపెట్టే ప్రయత్నం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంకో వైపు ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వంపై అసంతృప్తితోనే ఉన్నారు. గత వారంలో ఒక ఉపాధ్యాయుడు రుణభారంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి కారణం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేకపోవడమేనని తెలుస్తోంది. నెలనెల జీతాలు సకాలంలో రాకపోవడంతో చెల్లించాల్సిన బ్యాంకు రుణం వాయిదాలు చెల్లించలేకపోవడంతో సివిల్ స్కోరు పడిపోతోంది. ఇది రాబోయే రోజుల్లో ఎప్పుడైనా రుణం తీసుకుందామంటే తీసుకోలేని పరిస్థితి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నెలనెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలన్న డిమాండ్‌ను ఉద్యోగులు చేస్తున్నారు. ఇలా అనేక ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తుండటంతో పోరాటాలు పదునెక్కాయి. ఇక ఈ వారంలో చలి తీవ్రత పెరగడంతో మంచు పడుతుండటం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇకపోతే అనంతపురం రూరల్‌లో లారీ, ఐచర్‌ను ఢీకొట్టి ముగ్గురు మృతి చెందగా, శనివారం ఉదయం కల్లూరు వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఈ సీజన్‌లో మంచు కారణంగా జరిగే ప్రమాదాలతో అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరముంది.

రూ.98.79 లక్షల మిగులుతో బడ్జెట్ ఆమోదం

రాయదుర్గంలో కౌన్సిల్ మీట్

సమస్యలను లేవనెత్తుతున్న సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూ.98.79 లక్షల మిగులుతో పాలకమండలి ఆమోదం తెలిపింది. రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప అధ్యక్షతన శనివారం కౌన్సిల్ బడ్జెట్, సాధారణ, అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా సభ్యులు గోవిందరాజులు, అజయ్‌కుమార్ మాట్లాడుతూ పురపాలక సంఘపు ఆదాయం ప్రతి ఏడాది పెరగాలికానీ కొన్ని అంశాలలో ఎలా తగ్గించి చూపారని అకౌంటెంట్ ఈశ్వర్‌ను ప్రశ్నించారు. ఇందుకు అకౌంటెంట్ స్పందిస్తూ ఆర్థిక సంవత్సరం అంచనాలు మాత్రమేనని,, ఆదాయం పెరగవచ్చు.. తగ్గవచ్చు అని వివరించారు. అలాగే తాగునీటి పైప్‌లైన్ వేయడానికి టెండర్లు పిలిచి ఆరునెలలైనా ఇంతవరకూ పని చేయడం వల్ల స్థానికులు తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నట్లు 28వ వార్డు సభ్యులు గోవిందరాజులు తెలిపారు. అలాగే పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. నెలాఖరులోగా బిల్లులు చెల్లించనున్నట్లు గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్ తెలిపారు. వీధిదీపాల ఏర్పాటుకు టెండర్లు పిలిచి రెండు నెలలైనా ఇప్పటివరకు లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఇందుకు కమిషనర్ దివాకర్‌రెడ్డి స్పందిస్తూ త్వరలో లైట్లు తెప్పిస్తామని సమాధానం ఇచ్చారు. వీటితోపాటు అనేక సమస్యలపై సభ్యులు నిలదీశారు. అనంతరం పురపాలక సంఘం అధ్యక్షురాలు శిల్ప మాట్లాడుతూ ఆయా విషయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత బడ్జెట్ సాధారణ, అత్యవసర సమావేశపు అజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు అజయ్‌కుమార్, చన్నవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ర్యాలీలు

రాయదుర్గం : సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళు శిల్ప జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు లావణ్య, ప్రతాప్, శ్రీలక్ష్మి, మమత, షాబీరాబీ, శారద, నసీమా, లుబ్నా గజాల, గోవిందరాజులు, ఉష, దేవరాజు, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, వార్డు ఇన్‌ఛార్జి శివ, ఇస్మాయిల్, శ్రీరామిరెడ్డి, బషీర్, రామాంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాఠశాల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుత్తి : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పామిడి : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ టిసి హైస్కూల్ విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎద్దులపల్లి రోడ్డు వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి క్రీడల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది ఖాజామొద్దీన్, అబ్దుల్ హుస్సేన్, సచివాలయ సిబ్బంది నాగరాజు, వైసిపి పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, టిసి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 ఏళ్లు ఏం చేశారు..?

'పరిటాల' కుటుంబంపై ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఫైర్ - 'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

25 ఏళ్లు అధికారంతో వేల కోట్లకు పడగలెత్తిన పరిటాల కుటుంబం పేదలకు ఏం చేశారో చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్లలో కేవలం మూడు రోడ్లు పూర్తి చేశారన్నారు. తక్కిన రోడ్లు వేయకుండా నరకం చూపించారన్నారు. ఆమెతో పాటు భర్త కూడా మంత్రిగా పని చేసే అవకాశం కల్పించిన ప్రజల రుణం తీసుకోవడం అంటే ఇదేనా.. అని ప్రజలు నిలదీయాలన్నారు. ఇకపోతే పరిటాల కుటుంబానికి ధర్మవరంపై ప్రేమ పొంగిపోతోందని ఎద్దేవా చేశారు. ఎందుకంటే మాజీమంత్రి పరిటాల సునీత తన కొడుకు శ్రీరామ్‌ను అక్కడికి పంపించి పోటీ చేయించాలని చూస్తోందన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అక్కడ టికెట్ ఇస్తారని ఇల్లు కూడా కట్టుకున్నారన్నారు. టికెట్ ఇవ్వకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన శ్రీరామ్ చెప్పారని గుర్తు చేశారు. మరోవైపు నాలుగున్నరేళ్ల తర్వాత బయపటకు వచ్చిన పరిటాల సునీత రాప్తాడులో పర్యటిస్తూ ప్రకాష్‌రెడ్డి అభివృద్ధి చేయలేదని చెబుతోందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటిదాకా రూ.2500 కోట్లు నియోజకవర్గానికి ఖర్చు చేశామని వివరించారు. అలాగే ఈనెల 26 నుంచి నిర్వహించనున్న 'ఆడదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా నియోజవర్గంలో ఇప్పటి వరకూ వాలీబాల్, క్రికెట్ కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలకు పలు టీములు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ధనుంజయయాదవ్, వెంకటేష్, ఆదినారాయణ, జడ్పిటిసి చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్లస్థలాలు సర్వే చేసి అప్పగించాలి

ఆర్‌డిఓ గ్రంధి వెంకటేష్‌కు ఎంఆర్‌పిఎస్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కురుగుంట సర్వే నెంబర్ 41-1, 41-3, 41-3 లో గల భూమిలో దళితుల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని పేదలు వేసుకున్న బండలు తొలగించేశారు. ప్రభుత్వం స్పందించి హైకోర్టు ఆదేశాల మేరకు ఆ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి దళితులకు అప్పగించాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ఇళ్ల పట్టాలు పొందిన బాధితులతో కలిసి ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు దళిత సంఘాల నేతలు మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అద్యక్షులు బిసిఆర్.దాస్ మాట్లాడుతూ దళితుల ఇళ్ల స్థలాలు ల్యాండ్ సీలింగ్‌లో ఇచ్చామంటూ 11 సంవత్సరాల తరువాత తెరపైకి రావడం విడ్డూరంగా ఉందన్నారు. కాలనీ బోర్డ్ ఏర్పాటు చేసి, లబ్ధిదారులు బండలు నాటుకున్న తరువాత మా స్థలాలంటూ ఇప్పుడు రావడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రధాన రహదారిలో దళిత కాలనీ ఉండరాదనె రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆడిట నాటకంలో అధికార పార్టీ నేతలు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకరించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈ సమస్య రాష్ట్ర స్థాయి సమస్య కాకమునుపే ప్రభుత్వ పెద్దలు స్పందించాలన్నారు. దళితులకు జరుగుతున్న అన్యాయంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించాలన్నారు. లేని పక్షంలో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో విజయవాడకు వచ్చి ఆందోళన చేయాల్సి ఉంటుందన్నారు. తక్షణమే ఆ స్థలాలు పట్టాలు పొందిన దళితులకు అప్పగించాలన్నారు. నగరం, జిల్లా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కమాండెంట్ ఆర్.గంగాధర్‌రావు కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎఒ నాగ నాగభూషణమ్మ, అసిస్టెంట్ ఎఒ విజయ్‌కుమార్, అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు పెద్దయ్య, యూనిట్ కౌసర్ బేగం, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నాగేంద్ర, రామారావు, ఆర్.ఎస్.ఐ, ఆఫీసర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక సంగమేష్‌నగర్‌లోని బృహస్పతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ పవిత్ర ఆత్మ, శాంతితత్వం, ప్రేమకు నిదర్శనం క్రిస్మస్ పండుగ అన్నారు. క్రీస్తు జననం ఒక శకానికి ప్రారంభ వేదికగా మారిందని వివరించారు. ఇందులో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లాగే స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బృహస్పతి పాఠశాలలో సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

అలాగే స్థానిక సంఘమేశ్‌నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలల్లో ముందుస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ స్టార్స్, శాంతాక్లాస్ వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాలల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ పద్మావతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో ముందస్తు క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు అలరించాయి. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, అకడమిక్ జిల్లా కోఆర్డినేటర్ తిరుమలేసు, అకడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో కేక్ కోస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-పామిడి

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు తెలిపారు. శనివారం మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రస్తుం జగన్‌రెడ్డి పాలనలో ఏఒక్క వర్గం సంతోషంగా లేదన్నారు. ముఖ్యంగా టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు హనుమేష్‌రెడ్డి, దేవరపల్లి మాజీ సర్పంచి ప్రతాప్, తిరుపాలు, రామాంజి, శీన, శ్రీనివాస్, మాజీ సర్పంచి చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న హిమబిందు

నార్పలలో వికసిత్ భారత్ గ్రామసభ

నార్పల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వికసిత భారత్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుప్రియ, ఉపసర్పంచి గవ్వల శ్రీరాములు, పంచాయతీ సెక్రటరీ అశ్వర్థమనాయుడు, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎంఇఒ కృష్ణయ్య, ఎపిఎం తిప్పమ్మ, సిడిపిఒ భారతి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు డప్పు కళాకారులకు సన్మానం

అనంతపురం : మాదిగహక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పిఎస్) రాయలసీమ మహాసభల్లో భాగంగా ఆదివారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో డప్పు కళాకాలను ఘనంగా సన్మానించనున్నట్లు మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పసులూరు ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జై కిసాన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

శాస్త్రవేత్తలు కెఎస్ఎస్.నాయక్, రామసుబ్బయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులను ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు చేస్తున్న కృషి అభినందనీయమని శాస్త్రవేత్తలు డాక్టర్ కెఎస్ఎస్ నాయక్, రామసుబ్బయ్య, చంద్రమోహన్, అశోక్‌కుమార్ కొనియాడారు. జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అనంతపురం-బళ్లారి బైపాస్ నుంచి పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపం వరకూ విజయవాడ రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాజేష్ బందం నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జై కిసాన్ ఫౌండేషన్ నిరంతరం రైతులను ప్రోత్సహిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అర్జించే పంటను సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్ సీఐ తిమ్మయ్య, వ్యవసాయ అధికారులు శుభకర్, ఎంపిడిఒ అమృతరాజు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నారాయుడు, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, సభ్యులు రజినీకుమారి, మనస్వి, కోమల, లక్ష్మీకళ, సురేంద్ర, గోపాల్ రాధమ్మ, వంశీకృష్ణ, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.